
మరుగుజ్జు రాక్షసుడు




జపాను జానపద కథ

మరుగుజ్జు రాక్షసుడు



మరుగుజ్జు

రాక్షసుడు



చాలా రోజుల క్రితం నాటి సంగతి. ప్రపంచానికి ఒక మూల, సముద్ర తీరాన ఒక ప్రశాంత దేశం ఉండేది. చిన్న కొండ మీద ఒక అందమైన మహలు ఉండేది. అందులో అందమైన రాకుమారుడు మైనిచి, అందమైన రాకుమారి ఇచినిచి ఉండేవాళ్లు.

అక్కడి ప్రజలు ఎంతో కష్టపడి పని చేసేవాళ్లు. తమ రాకుమారుడిని, రాకుమారిని ఎంతో ప్రేమించేవాళ్లు. అక్కడ సూర్యుడు వెలుగులు నింపేవాడు, చంద్రుడు చల్లదనాన్ని పంచేవాడు. అక్కడ ప్రతి రోజూ అంతకు ముందు రోజు లాగే ఉండేది.

ఒక రాత్రి సముద్రం మీద వెన్నెలను కురిపిస్తున్న చంద్రుడిని రాకుమారుడు, రాకుమారి చూస్తూ ఉన్నారు.

“ఎంత అందంగా ఉంది," రాకుమారి నిట్టూర్చింది.

“అవును!" గుసగుసగా అన్నాడు రాకుమారుడు. “అన్ని రాత్రుల లాగానే ఇది కూడా ఉంది. జీవితంలో కొత్తది, ఉత్తేజ భరితమైనది ఏదైనా జరిగితే బాగుండును అని అప్పుడప్పుడు అనిపిస్తుంది."

అప్పుడు చిరిగిన తెరచాపలతో దూరంగా ఒక పడవ కనిపించింది. కొంచెం సేపటికి అది తీరాన్ని చేరుకుంది.






పడవ లోంచి ఒక మరుగుజ్జు దిగాడు. అతడు మహలు లోకి వచ్చాడు. “నేను ఒక తుఫానులో చిక్కుకుని పోయాను," ఆ మరుగుజ్జు చెప్పాడు.
“కొంచెం సేపు ఇక్కడ విశ్రాంతి తీసుకోవచ్చా?"
“అందమైన, ప్రశాంతమైన మా దేశానికి స్వాగతం," రాకుమారి ఇచినిచి అంది.
“ఇక్కడికి కొత్తవాళ్ల ఎప్పుడోగాని రారు," అన్నాడు రాకుమారుడు మైనిచి. “ఈ రోజు మాతో పాటు భోజనం చెయ్యి."
అన్నం, పుట్టకొక్కులు, కోడి కూరలను మరుగుజ్జు చిటికెలో మింగేశాడు.







“మన అతిథి కోసం నాట్యం చెయ్యి," అని రాజకుమారిని రాకుమారుడు అడిగాడు.
“ఈ రాత్రి మీకు నేను సంగీతం వినిపిస్తాను," అంటూ వేణువు తీసుకున్నాడు మరుగుజ్జు రాక్షసుడు.
అతడు వేణువు వాయించటం మొదలుపెట్టగానే మొదట ఒక చిట్టెలుక దాని మీద నాట్యం చేయసాగింది. కొంత సేపటికి అది మాయమయ్యి ఒక పాము వేణువుని చుట్టుకొని ఉంది. మరి కొంచెం సేపటికి దాని స్థానంలో ఒక గుడ్లగూబ వచ్చింది. సంగీతం తీవ్ర స్థాయికి చేరుకోవటంతో గుడ్లగూబ ఒక్కసారి అరిచి ఎగిరిపోయింది.
“అద్భుతంగా ఉంది!" రాకుమారుడు అన్నాడు.
“నాకు భయంగా ఉంది," రాకుమారి మెల్లగా అంది.
“మన రాజ్యంలో ఇప్పుడు ఉత్తేజం పుడుతుంది," రాకుమారుడు అన్నాడు.
కొంచెం సేపటికి వేణువు ఢంకాగా మారింది. దాని నుంచి ఉరుముల్లాంటి శబ్దాలు రాసాగాయి.






“ఇప్పుడు నాట్యం చెయ్యండి!" అరిచాడు మరుగుజ్జు రాక్షసుడు. రాకుమారిని పట్టుకుని రాకుమారుడు నాట్యం చెయ్యసాగాడు.


“నా సంగీతానికి అందరూ నాట్యం చెయ్యండి!" అంటూ నౌకర్లను ఆదేశించాడు మరుగుజ్జు రాక్షసుడు.


ఆ నాట్యానికి రాచమహాలు కంపించి పోయింది.



దూరంగా సముద్ర తీరంలో ఉన్న ఒక ముసలి రైతు తన కలలోంచి మేల్కొన్నాడు. ఆ శబ్దాలకు అతడు, అతడి భార్య గాభరా పడిపోయారు. వాళ్లకి మళ్లీ నిద్ర పట్టలేదు.
సూర్యోదయం వరకు మహలులో నాట్యం కొనసాగింది.
అలసిపోయిన నౌకర్లు గాఢ నిద్రలోకి జారుకున్నారు.
అప్పుడు ఢంకా కాస్తా వేణువుగా మారిపోయింది.
“సంగీతంతో మహలు హోరెత్తిపోయింది!" రాకుమారి అంది.
“నాకు చాలా మజా వస్తోంది," రాకుమారుడు అన్నాడు.
“నాతో వస్తే ఇంకా ఎంతో మజా వస్తుంది," మరుగుజ్జు రాక్షసుడు అన్నాడు.







తరవాత మరుగుజ్జు రాక్షసుడు తోటలోని పెద్ద చెర్రీ పళ్ల చెట్టు చిటారు కొమ్మను ఎక్కాడు. రాకుమారుడు కూడా అతడి వెనకే చెట్టు ఎక్కాడు. ఉన్నట్టుండి ఆ చెట్టు కొమ్మలు విరిగి, పడిపోసాగాయి.

“మా అందమైన చెర్రీ చెట్టును పాడు చేస్తున్నావు!" రాకుమారి అరిచింది. “ఈ అల్లరి వెంటనే ఆపండి!" “నా స్నేహితుడిని అవమానిస్తున్నావు!" రాజకుమారుడు కోపగించుకున్నాడు. మరుగుజ్జు రాక్షసుడు చెట్టును గట్టిగా ఊపాడు. చెర్రీ పూలు కంకర రాళ్లుగా మారి రాకుమారిపై పడసాగాయి. “అతడిని ఆపండి!" రాకుమారి మొత్తుకుంది. “అతడు దుష్టుడు, మనకు హాని చేస్తాడు!“ “ఈ పిచ్చిదానిని వదిలించుకో," మరుగుజ్జు అన్నాడు. “అప్పుడు మనిద్దరం మనకు నచ్చిన పనులు చెయ్యవచ్చు."

మరుగుజ్జు చెట్టు మీద నుంచి దూకాడు. “నేను కూడా వస్తున్నాను," అంటూ రాకుమారుడు అరిచాడు.

పూలను తొక్కుతూ వాళ్లిద్దరూ నాట్యం చెయ్యసాగారు.

“స్పృహలోకి రా!" అంటూ రాకుమారి మొరపెట్టింది, “ఈ దుష్ట ఆటలు ఆపు!"

"ఆటలు!" మరుగుజ్జు అన్నాడు. “నీకొక మంచి ఆట చూపిస్తాను!"






అతడు చేతులు ఊపగానే అక్కడ చదరంగం బల్ల ప్రత్యక్షం అయ్యింది.

చదరంగం లోని పావులు రాకుమారిని అక్కడి నుంచి తరిమేశాయి.


“ప్రియ నేస్తమా, ఆమె వెళ్లిపోయింది!" రాకుమారుడు కిసుక్కుమన్నాడు.

“ఇప్పుడు మనం ఇష్టం వచ్చినట్టు చెయ్యవచ్చు, ఆనందించవచ్చు!"







మహలు నుంచి రాకుమారి పరిగెత్తింది.
ఆమె పరిగెత్తి, పరిగెత్తి ముసలి రైతు, అతని భార్య ఉండే చోటుకి చేరుకుంది.
“నా భర్తని, ఇంటిని దుష్టుడైన మరుగుజ్జు నుంచి కాపాడుకోవాలి," రాకుమారి ఏడుస్తూ చెప్పింది.
“మీకు మేం సాయం చేస్తాం," రైతు చెప్పాడు.
అందరూ కలిసి తేనీరు తాగారు. “నాకు ఒక ఉపాయం తట్టింది. మీరు నాతో రండి," అంది రాకుమారి.



అక్కడ మహలులో రాకుమారుడు, మరుగుజ్జు గంతులేస్తూ నౌకర్లను లేపుతున్నారు.
“లేవండి! లేవండి!" రాకుమారుడు అరుస్తున్నాడు. “ఇది వినోదాల సమయం. నా ప్రియ మిత్రుడు తన మాయాజాలాన్ని చూపిస్తాడు."





మరుగుజ్జు ఒక పిల్లిమొగ్గ వెయ్యగానే రాకుమారుడి ముక్కు నుంచి ఒక ఎలక వచ్చింది. అతడు నవ్వాడు. ఎలక మాయం అయ్యి రాకుమారుడి నడుముకి ఒక పాము చుట్టుకుంది. అతడికి భయం వేసింది. పాము మాయమయ్యి ఒక పెద్ద గబ్బిలం రాకుమారుడి నెత్తి మీద కూర్చుంది. “ఆపు, ఆపు!" రాకుమారుడు అరిచాడు. “ఈ ఆటలు ఇప్పుడు నాకు ఇష్టంగా లేవు."

మరుగుజ్జు రెండు పిల్లిమొగ్గలు వేశాడు. అతడు ఒక పెద్ద రాక్షసుడిగా మారాడు. అతడి చేతిలో మండుతున్న కత్తి ఉంది.
“ఇప్పుడు నా కోసం మాయాజాలం చెయ్యి!" రాక్షసుడు అరిచాడు. “ఈ కత్తిని మింగు."
“నేను మింగలేను," రాకుమారుడు అన్నాడు. “మనం ఇంతకు ముందు లాంటి ఆటలే ఆడుకుందాం, మిత్రమా."
“పిచ్చోడా, నేను నీ స్నేహితుడిని కాదు!" రాక్షసుడు గర్జించాడు. “నిన్ను నాశనం చేసి, నీ రాజ్యాన్ని ఆక్రమించటానికి వచ్చాను."




అప్పుడే భారీకాయుడైన మరొక రాక్షసుడు వచ్చాడు. అతడికి చాలా చేతులు ఉన్నాయి, ప్రతి ఒక్క చేతిలో ఒక కత్తి ఉంది.

“నువ్వు నన్ను భయపెట్టలేవు!" మరుగుజ్జు రాక్షసుడు అరిచాడు. “నీ కంటే పది రెట్లు పెద్దగా అవ్వగలను, నీ లాంటి రాక్షసులను ఒక్క గుటకలో మింగెయ్యగలను." బుసకొట్టినట్టు ఊపిరి పీలుస్తూ మరుగుజ్జు రాక్షసుడు ఇంకా, ఇంకా పెద్దగా అవ్వసాగాడు. చేతులలో కత్తులతో పెద్ద రాక్షసుడు ముందుకు కదిలాడు.







ఉన్నట్టుండి ఒక పెద్ద చప్పుడు అయ్యింది. మహాలు కంపించింది. దేశం అంతా కంపించసాగింది. మరుగుజ్జు రాక్షసుడు వెయ్యి ముక్కలుగా అయ్యాడు.


“రాక్షసుడు చచ్చిపోయాడు," ప్రజలు ఆశ్చర్యపోయారు. “అతడి మాయాజాలం ముగిసింది!"





మేలు చేసిన మహాకాయుడి ముందు రాకుమారుడు మైనిచి మోకరిల్లాడు. "మీరు ఎవరో నాకు తెలియదు. కానీ, నా జీవితాన్ని మీరు కాపాడారు," అన్నాడు. "ఇక ఏడ్పు ఆపు. నువ్వు మూర్ఖుడి లాగా ప్రవర్తించావు!" అంటూ రైతుల భుజాల మీద నుంచి రాకుమారి కిందకి దిగింది. "ధన్యవాదాలు, ప్రియ స్నేహితులారా," రాకుమారి రైతులతో అంది. "ఎంతో ధైర్యంతో మీరు నాకు సహాయం చేశారు." "నా ప్రియమైన భార్యా, నా మూర్ఖత్వానికి నన్ను క్షమించు. ప్రియమైన ప్రజలారా, ఈ మహలును శుభ్రం చెయ్యటానికి మీ సహాయం కావాలి."




మహలు మళ్లీ అందంగా తయారయ్యింది. దీపాలు వెలిగించారు. రాజ్యంలోని ప్రజలందరూ వచ్చారు. రుచికరమైన వంటలతో చక్కటి విందు చేశారు. రాకుమారుడు తన వేణువుపై మధుర సంగీతం వినిపించాడు, రాకుమారి అందంగా నాట్యం చేసింది. అందరూ సంతోషంగా ఉన్నారు.










తరవాత రాకుమారుడు, రాకుమారి నిద్రకు ఉపక్రమించారు. అంతలో ఒక సేవకుడు వచ్చి, “మహారాజా, ఒక ఆగంతకుడు బయట తలుపు వద్ద ఉన్నాడు!" అని చెప్పాడు. “ఏం చేద్దాం?" రాకుమారి అడిగింది. “అతడిని ఏం చెయ్యాలో రేపు ఆలోచిద్దాం," రాకుమారడు మైనిచి అన్నాడు. “ఇప్పటికి వెన్నెలలో విశ్రమిద్దాం."



అయిపోయింది